

దూషించాడని హత్య
అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిని హత్య చేసిన వారిని పోలీసులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. - 8లో



బుద్ధవనం శిల్పకళా నిలయం
బుద్ధవనం అద్భుత శిల్పకళా నిలయమని టీఎస్‌ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ నరసింహారెడ్డి అన్నారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30°/25°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంజీయూ వీసీకి 'శాతవాహన' బాధ్యతలు

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డికి ప్రభుత్వం శాతవాహన యూనివర్సిటీ బాధ్యతలు అప్పగించింది. శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ మల్లేశం విదేశీ పర్యటనకు వెళ్లడంతో ఆ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా గోపాల్‌రెడ్డి నియమిస్తూ గురువారం ఉన్నత విద్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు.

పంట నష్టపరిహారం రూ.2.95కోట్లు విడుదల

నల్లగొండ: జిల్లా వ్యాప్తంగా గత మార్చి, ఏప్రిల్ మాసంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.2.95కోట్ల పరిహారాన్ని విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత మార్చి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లాలో 2,409 మంది రైతులకు సంబంధించి 2955.29 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. దీంతో ప్రభుత్వం ఆయా రైతులకు పరిహారం చెల్లింపునకు 2,95,57,250 రూపాయల పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేసి నివేదిక పంపించారు. ఈ మేరకు ఇన్‌చార్జి ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జ మొత్తం పంట నష్టపరిహారాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీగా ఎంవీఎన్ రెడ్డి



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీగా ఎంవీఎన్.రెడ్డిని నియమిస్తూ గురువారం యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఇప్పటివరకు ఈ పదవిలో మిర్యాల రమేష్ కొనసాగారు. ఆయన పదవీకాలం పూర్తి కావడంతో ఎంవీఎన్.రెడ్డిని నియమించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణారావు, అధ్యాపకులు రవి, సీఓఈ రమేష్, అరుణ ప్రియలు అభినందనలు తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి ఆహ్వానం

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రాష్ట్ర క్రీడల పాఠశాల హకీంపేట్, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ కరీంనగర్, రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ ఆదిలాబాద్ లలో 4, 5వ తరగతుల్లో 2023-24లో విద్యా సంవత్సరంలో ప్రవేశానికి జిల్లా స్థాయి ఎంపికలు ఈనెల 14న బాలురకు, 15న బాలికలకు నల్లగొండలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు నిర్వహించబడునని జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని హైదరాబాద్ లోని హకీంపేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎత్తు, బరువు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, షటిల్ రన్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు పందెం ఉంటుందని పేర్కొన్నారు. 4వ తరగతిలో ప్రవేశానికి 01-09-2014 నుంచి 31-08-215 మధ్య, 5వ తరగతిలో ప్రవేశానికి 01-09-213 నుంచి 31-08-2014 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు వయసు, విద్య ధ్రువీకరణ, జన్మదిన సర్టిఫికెట్, 3, 4 వతరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9866317321 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎంపీపీపై అవిశ్వాస నోటీసు



నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీలు

మర్రిగూడ : ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ మర్రిగూడ మండలంలోని పలు గ్రామాల ఎంపీటీసీలు గురువారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయ అధికారికి నోటీసు అందజేశారు. అభివృద్ధికి సహకరించకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఎంపీటీసీలపై పెత్తనం చెలాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని నోటీసులో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గండికోట రాజమణి, దాసరి మమత, నేనావత్ బంతిలాల్, కట్కూరి వెంకటేష్‌గౌడ్, ఏర్పుల శ్రీశైలం, వెన్నమనేని శోభ, తుమ్మల వరప్రసాద్, సిలివేరు విష్ణు తదితరులు ఉన్నారు.



చింతపల్లి మండలం మాన్సింగ్ తండాలో గతేడాది ఆరుగురు విద్యార్థులు ఉండగా, వారు ప్రైవేటు స్కూల్‌కు వెళ్లిపోయారు. ఈసారి ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీంతో విద్యార్థుల్లేక ఇద్దరు ఉపాధ్యాయులు ఖాళీగా కూర్చుంటున్నారు.



దేవరకొండ మండలం సాయిరాం తండా ప్రాథమిక పాఠశాలలో గతేడాది 12 మంది విద్యార్థులు ఉండగా, వారంతా వెళ్లిపోయారు. ఈసారి ఒక విద్యార్థి చేరినా, అతను స్కూల్‌కు రావడం లేదు. దీంతో ఉపాధ్యాయుడు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది.



పెద్దవూర మండలంలోని మల్లెవానికుంటతండా ప్రాథమిక పాఠశాల భవనం ఇది. విద్యార్థుల్లేక రెండేళ్ల కిందట దీనిని మూసేశారు. తండావాసులు పశువులకు, పశుగ్రాసానికి వినియోగించుకుంటున్నారు.

- నలుగురైదుగురు విద్యార్థులకు ఏడెనిమిది మంది టీచర్లు
- అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ
- గిరిజనతండాల్లో బడులను పట్టించుకునే వారే లేరు
- 'సాక్షి' క్షేత్ర స్థాయి పరిశీలనలో వెల్లడి

ఉపాధ్యాయులు ఫుల్.. విద్యార్థులు నిల్

సర్కారు బడికి మూసివేత ముప్పు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తండాల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఇప్పటికే చాలా స్కూళ్లు మూతపడగా, మరికొన్ని పాఠశాలలపై మూసివేత కత్తి వేలాడుతోంది. ‘సాక్షి’ జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది.

ఉచిత పుస్తకాలు, యూనిఫారాలు ఇస్తున్నా

సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉన్నా, యూనిఫాం, పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నా ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల్లో నమ్మకం కుదరడం లేదు. ప్రతి ఏటా జూన్ మొదటి వారం నుంచే నిర్వహిస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. 'మన ఊరు మనబడి' ద్వారా పాఠశాలల్లో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా గిరిజన తండాల్లో విద్యార్థుల సంఖ్య పెద్ద ఎత్తున తగ్గిపోతోంది. తల్లిదండ్రులు పనుల కోసం వలస వెళ్లడం వల్ల కొంత మంది దూరం అవుతుండగా, ఆర్థిక స్థోమత కలిగిన వారు తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చేర్పిస్తున్నారు. కొందరు గురుకుల పాఠశాలల్లో చేర్పించేందుకు ఇష్టపడుతున్నారు.

సర్దుబాటేదీ?

పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచిపోయింది. అయినా విద్యాశాఖ పూర్తి స్థాయిలో పరిస్థితులను గాడిన పెట్టలేదు. దీంతో విద్యార్థుల్లేకపోయినా టీచర్లు బడులకు వెళ్లి ఖాళీగా కూర్చుని వస్తున్నారు. కొన్ని స్కూళ్లలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులు.. ఎక్కువ మంది పిల్లలున్న స్కూళ్లకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. మండల విద్యాధికారులు సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తుంటే వారిపై ఒత్తిడి తెచ్చి విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏటేటా మూత పడుతున్న స్కూళ్లు

జిల్లాలో 2021-22 విద్యా సంవత్సరంలో 151 పాఠశాలలు విద్యార్థుల్లేక మూతపడ్డాయి. అందులో 2022-23లో కేవలం పది పాఠశాలలు మాత్రమే తెరుచుకున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 1483 పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో ఈసారి ఎన్ని స్కూళ్లు మూతపడతాయో తేలాల్సి ఉంది.



చింతపల్లి మండలం దేనియతండాలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోవడంతో తెరుచుకోని స్కూల్

జిల్లాలోని పలు పాఠశాలల్లో పరిస్థితి ఇదీ..

- అడవిదేవులపల్లి మండలం గోనియతండా ప్రైమరీ స్కూల్లో 17 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లు ఉన్నారు.
- శాలిగౌరారం మండలంలో విద్యార్థుల్లేక ఇప్పటికే 5 ప్రాథమిక పాఠశాలలను మూసివేయగా, మరో రెండు మూసివేసే పరిస్థితి నెలకొంది. గురజాల జడ్పీ ఉన్నత పాఠశాలను విద్యార్థుల్లేక మూసేశారు. రామంజపురం, వద్దిపాముల స్కూళ్లలో పది మంది లోపే విద్యార్థులున్నారు.
- మిర్యాలగూడలోని షాబునగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో 19 మంది విద్యార్థులున్నా గురువారం నలుగురే హాజరయ్యారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. తెలుగు మీడియం స్కూల్లోనూ రికార్డుల ప్రకారం 16 మందికి ఐదుగురే హాజరయ్యారు. అక్కడ ఇద్దరు టీచర్లు ఉన్నారు.
- అనుముల మండలంలోని మార్లగడ్డగూడెం ఏడుగురు విద్యార్థులు ఉండగా, ఒక టీచర్ ఉన్నారు.
- నార్కట్‌పల్లి మండలం శేరూబావిగూడెం స్కూల్లో ఒక టీచర్ ఉండగా, ఒక్క విద్యార్థి కూడా లేరు. దాసరిగూడెం స్కూల్లో ముగ్గురు విద్యార్థులు ఒక టీచర్, ఆవులోనిబావి స్కూల్లో ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు టీచర్లు ఉన్నారు. జువ్విగూడెం స్కూల్లో ముగ్గురు విద్యార్థులు, ఇద్దరు టీచర్లు, గద్దగోటిబావి స్కూల్లో నలుగురు విద్యార్థులు ఒక టీచర్, తుర్కబావిగూడెం స్కూల్లో ఐదు విద్యార్థులు, ఒక టీచర్ ఉన్నారు. బెండల్‌పహాడ్‌లో ఐదుగురు విద్యార్థులు, ఒక టీచర్, బాకీగూడెం స్కూల్లో ముగ్గురు విద్యార్థులు, ఒక టీచర్ ఉన్నారు.
- తిరుమలగిరి(సాగర్) మండలంలో సపావత్ తండా, పిలిగుండ్ల తండా, తిరుమలగిరి కాలనీ, చెన్నైపాలెం, మేగ్యాతండా, ఇరికితండా, గాత్ తండా, చెక్కోలం తండా, గరకనెట్ తండా పాఠశాలలు మూతపడ్డాయి. అల్వాలతండా, మూలతండా, చెంచోనితండా, తెట్టేకుంట, గట్టుమీదితండా, చౌటచెరువు, తూటిపేట తండా, సుంకిశాల తండా, ఎర్రచెరువు తండా ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో దాంట్లో పది మందిలోపే పిల్లలు ఉండగా, టీచర్లు ఒక్కో స్కూళ్లో ఇద్దరు చొప్పున ఉన్నారు.
- డిండి మండలం డాక్యతండా ప్రైమరీ స్కూల్లో నలుగురు విద్యార్థులు ఉండగా, ఒక టీచర్ ఉన్నారు. దేవత్‌పల్లితండాలో స్కూల్లో ఐదుగురు విద్యార్థులు ఒక టీచర్, శాంతిగూడెం స్కూల్లో నలుగురు విద్యార్థులు ఒక టీచర్, ఆకుతోటపల్లి, కేగౌరారం స్కూల్లో 8 మంది విద్యార్థులకు ఒక టీచర్ చొప్పున ఉన్నారు.
- మాడుగులపల్లి మండలం కేశవాపురం స్కూల్లో 8 మంది విద్యార్థులు ఒక టీచర్ ఉన్నారు. ఆ టీచర్ కూడా సెలవులో ఉన్నట్లు చెబుతున్నారు. చిన్నగూడెం, మర్రిగూడెం, పోరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలు ఇదివరకే మూతపడ్డాయి. పూసలపహాడ్ ప్రాథమిక పాఠశాలలో 8 మంది విద్యార్థులుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.
- తిప్పర్తి మండలం గొల్లగూడెం, కొరివేనిగూడెం, సోమవారంగూడెం, ఆరెగూడెం ప్రాథమిక పాఠశాల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు.
- కట్టంగూరు మండలం పందెనపల్లి పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఒక టీచర్, సత్యనారాయణపురంలో 8 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.
- నల్లగొండ మండలం అన్నారెడ్డిగూడెం పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లు ఉన్నారు. పారేపల్లిగూడెంలో 9 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.
- మర్రిగూడ మండలంలో భోజ్యతండా, పాకగూడ, నరసింహాపురం, సరంపేటతండాలలో విద్యార్థులు లేకపోవడంతో 4 పాఠశాలలు మూతపడ్డాయి. నర్సిరెడ్డిగూడెం, పడమటితండాలో ఆరుగురు చొప్పున విద్యార్థులున్నారు.
- త్రిపురారం ప్రాథమికోన్నత పాఠశాలలో 33 విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉన్నారు. రూప్లాతండాలో 18 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉన్నారు. కామరెడ్డిగూడెంలో 15 మంది విద్యార్థులకు ఏడుగురు టీచర్లు, మీట్యతండా, డొంకతండ పాఠశాలల్లో విద్యార్థుల్లేకపోయినా ఇద్దరు చొప్పున టీచర్లు ఉన్నారు. రాగడప, దుర్గానగర్, లక్ష్మీపురంలో విద్యార్థుల్లేకపోయినా ఒకరు చొప్పున టీచర్లు ఉన్నారు. మునగబావిగూడెంలో విద్యార్థుల్లేరు. ఇద్దరు టీచర్లు ఉన్నారు. పాల్తితండాలో 5గురు విద్యార్థులు, ఇద్దరు టీచర్లు, లక్పటితండాలో ఇద్దరు విద్యార్థులు ఇద్దరు టీచర్లు ఉన్నారు.

టీచర్లు పట్టించుకోవడం లేదు



పిల్లలను బడిలో టీచర్లు పట్టించుకోవడం లేదు. బడికి పంపితే పిల్లలు బయట తిరుగుతున్నారు. బడిలో టీచర్లు ఎవరు ఉంటున్నారో తెలియడం లేదు.

–దనావత్ బాబు, రాప్లాతండా, త్రిపురారం

విద్యార్థులు తక్కువున్న స్కూళ్లను గుర్తిస్తున్నాం

విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తిస్తున్నాం. విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఎక్కువగా ఉన్న టీచర్లను గుర్తిస్తున్నాం. ఇప్పటివరకు 11 పాఠశాలల్లో పిల్లలు తక్కువగా ఉన్నట్లు గుర్తించాం. పిల్లలు తక్కువ ఉన్న వాటిని సర్దుబాటు చేస్తాం. తిరిగి పిల్లలు చేరితే తెరుస్తాం.

–భిక్షపతి, డీఈఓ

● పంచాయతీ కార్మికుల సమ్మె బాట



తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం కనగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

గాంధీ భవన్‌లో మునుగోడు రచ్చ

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకంపై దుమారం

మునుగోడు: నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల నియామకం ఏకపక్షంగా జరిగిందని, పీసీసీ కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి తన అనుచరులకు పదవులు ఇప్పించుకున్నారని ఆరోపిస్తూ ఆ పార్టీ నాయకులు పాల్వాయి స్రవంతి, పున్న కైలాస్ నేత గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద ఆందోళన చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు దక్కలేదని, ఆ నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం చలమల్ల కృష్ణారెడ్డి ఏకంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి లెటర్ ప్యాడ్‌పై మునుగోడు నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్షుల పేర్లని ప్రకటించి లేఖ విడుదల చేశారు. దీనిపై నియోజకవర్గ నాయకురాలు పాల్వాయి స్రవంతి, పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారం దాదాపు 300 మందికిపైగా తమ అనుచరులతో గాంధీ భవన్‌కు వెళ్లారు. ఆ సమయంలో పార్టీ సమావేశం జరుగుతుండగా గాంధీ భవన్ వద్ద ఉన్న సెక్యూరిటీ లోపలికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో స్రవంతి, కైలాస్ వర్గీయులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పాటు సెక్యూరిటీని తోసుకొని లోపలికి వెళ్లే ప్రయత్నం చేశారు. దానిని గమనించిన పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అక్కడికి వచ్చి సమస్యను తెలుసుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలో జరిగిన పరిణామాలని పూర్తిగా తెలుసుకొని రెండు రోజుల్లో పార్టీ కార్యకర్తలకు తగిన న్యాయం జరిగేలా చొరవ చూపుతానని, అప్పటి వరకు ఎవరూ ఆందోళన చెందవద్దని నచ్చజెప్పి పంపించారు. నియోజకవర్గంలో కొంతకాలంగా చలమల్ల కృష్ణారెడ్డికి, పాల్వాయి స్రవంతి, పున్న కైలాస్‌ల మధ్య వర్గపోరు నడుస్తోంది. చలమల్ల కృష్ణారెడ్డి అందరిని కలుపుకుపోకుండా సొంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వీటికి తోడు.. ఇటీవల కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను ప్రకటించడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పదవులను ఏకపక్షంగా ప్రకటించారని అంటున్నారు.

గడువులోగా పెండింగ్ సీఎంఆర్ ఇవ్వాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ: పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను గడువులోగా ఇవ్వాలని రైస్ మిల్లర్లను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో సీఎంఆర్ డెలివరీ ప్రక్రియపై మిల్లర్లు, ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సీఎంఆర్ పెండింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యాసంగి, వానా కాలం సీజన్ల కింద 11లక్షల 12వేల75 మెట్రిక్ టన్నుల వడ్లను జిల్లాలోని 143 రైస్ మిల్లులకు ఇచ్చామన్నారు. 5 లక్షల 65వేల 973 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి ఎఫ్‌సీఐకి రావాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 1.86లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం వచ్చిందన్నారు. జిల్లాలో రోజూ 4,500 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు, ఎఫ్‌సీఐ డీఎం వరుణ్ సూద్, మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిప్యుటేషన్ స్థానాలకు వెళ్లాల్సిందే..

- జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధ్యాయులకు ఇచ్చిన డిప్యుటేషన్ స్థానాలకు తప్పకుండా వెళ్లాల్సిందేనని డీఈఓ భిక్షపతి ఆదేశించారు. గురువారం సాక్షి దినపత్రిక మెయిన్ ఎడిషన్‌లో తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్లు ఐదుగురు.. విద్యార్థులు ముగ్గురే అని ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి స్పందించారు. ఈ మేరకు గురువారం నెల్లికల్లు పాఠశాలకు చెందిన ఆ ఐదుగురు ఉపాధ్యాయులను తన కార్యాలయానికి పిలిపించుకొని మాట్లాడారు. రెండు రోజుల క్రితం డిప్యూటేషన్ ఇచ్చినా ఆయా పాఠశాలకు ఎందుకు వెళ్లలేదని సదరు ఉపాధ్యాయులపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సదరు ఉపాధ్యాయులు రేపటి నుంచి ఎవరి కేటాయించిన డిప్యుటేషన్ స్థానాలకు వారే విధిగా వెళ్లాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశించారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.

● 'జునోసిస్' సందడి



ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నల్లగొండలోని పశువుల ఆస్పత్రిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇప్పించడానికి తన పెంపుడు కుక్కను తీసుకొచ్చిన యువతి.

ఏఎస్‌డబ్ల్యూఓను సస్పెండ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

నల్లగొండ టౌన్ : ఎస్సీ విద్యార్థులకు హాస్టల్ సీటు ఇవ్వని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూఓ)ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు సీటు కోసం వెళితే సీట్లు లేవని పంపించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూఓ)తోపాటు ఏఎస్‌డబ్ల్యూఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సైదానాయక్, కోరె రమేష్, రవీందర్, జగన్‌నాయక్, సంపత్, శివ, అఖిల్, సాయి, రవి, నవదీప్ పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించొద్దు

- ఎస్పీ అపూర్వరావు



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: విద్యా సంస్థలకు విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు పరిమితికి మించి తమ ఆటోల్లో తీసుకెళ్లొదని జిల్లా ఎస్పీ అపూర్వరావు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, పాటించాల్సిన కనీస నియమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాణానికి డ్రైవర్లదే బాధ్యతన్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారం ఆటోలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి, ఓవర్ టేక్ చేయడం లాంటి చేస్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రతి వాహనానికి డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాదరావు, టూటౌన్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఆర్‌ఐ స్పర్జన్‌రాజ్, సంతోష్, ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న శంకరయ్య

మునుగోడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరినీ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు మాదగోని శంకరయ్య ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన మునుగోడు మండలం పులిపలుపుల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించడంతో పాటు ఇంగ్లిష్, తెలుగులో పాఠాలను చదవించి వారి పఠన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధుల పట్ల ఏ మాత్రం అలసత్వం వహించవద్దన్నారు. రోజులో కనీసం అరగంట పాటు ఆటలు ఆడించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఆ పాఠశాల హెచ్‌ఎం స్వామి, ఉపాధ్యాయులు నర్సింహ, లలిత, ఉష, రవీందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


గోపి (ఫైల్)

కనగల్: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన కనగల్ మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన కోల వెంకన్న, ముత్తమ్మ దంపతుల మొదటి కుమారుడు కోల గోపి(20) గ్రామంలోని కిరాణ దుకాణానికి వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు తెగి అతడి మీద పడ్డాయి. దీంతో అతడు విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. పక్కనే వెళ్తున్న రైతు అశోక్ గమనించి కర్ర సహాయంతో విద్యుత్ తీగలను తొలగింపజేశాడు. చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో గోపిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేతికి అందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గోపి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కనగల్ పోలీసులు తెలిపారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌లో చోరీ.. నిందితుల అరెస్ట్

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యంత్రాలకు అమర్చే సుమారు రూ.98వేల విలువైన బేరింగ్‌లను చోరీ చేసిన నిందితులను గురువారం దామరచర్ల మండల కేంద్రం శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనులు చేస్తున్న ఆల్ఫా పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ లిమిటెడ్‌కు చెందిన 6 లైన్ సాఫ్ట్ ఇత్తడి బేరింగ్‌లు చోరీ గురయ్యాయి. దీంతో సంస్థకు చెందిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసకొని విచారణ చేపట్టిన పోలీసులు గురువారం దామరచర్ల శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా చోరీకి గురైన మెటీరియల్ ఉండడంతో అందులో ప్రయాణిస్తున్న పయ్యావుల సైదారావు, తురక రమేష్, క్రాంతి, చెన్నబోయిన శ్యామ్‌ను అదుపులోకి తీసుకోని విచారించగా నిజం అంగీకరించారు. దీంతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, భాస్కర్, సైదులు, ఖయ్యూం, రషీద్, సతీష్ తదితరులు ఉన్నారు.

అసభ్య పదజాలంతో దూషించాడని హత్య

- వీడిన అల్వాలపహాడ్ వాసి మర్డర్ మిస్టరీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన హాలియా సీఐ గాంధీనాయక్


వివరాలు వెల్లడిస్తున్న హాలియా సీఐ గాంధీనాయక్, వెనుక నిందితులు

త్రిపురారం: జనం అందరి ముందు తనను అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై కక్ష పెంచుకొని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితులను పోలీసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శోభన్‌బాబుతో కలిసి హాలియా సీఐ గాంధీనాయక్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని బి.అన్నారం గ్రామానికి చెందిన రాందేని శివ హాలియాలోని సోనాలిక ట్రాక్టర్ షోరూంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అంతే కాకుండా త్రిపురారం మండలానికి సేల్స్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ప్రతి గ్రామానికి తిరుగుతూ సోనాలిక ట్రాక్టర్ల గురించి ప్రచారం చేస్తున్నాడు. జూన్ 29న బి.అన్నారం గ్రామానికే చెందిన తన మిత్రుడు పేరూరు శివతో కలిసి త్రిపురారం మండలంలోని అల్వాలపహాడ్ గ్రామానికి వెళ్లిన రాందేని శివ అక్కడ ట్రాక్టర్ యజయానులకు సోనాలిక ట్రాక్టర్ గురించి వివరిస్తున్నాడు. అదే సమయంలో అల్వాలపహాడ్ గ్రామానికే చెందిన బొలిగోర్ల వెంకన్న వారి వద్దకు వచ్చి 'ముందు మాయమాటలు చెప్పి ట్రాక్టర్లు కొనేటట్లు చేస్తారు.. తర్వాత కిస్తీలు కట్టాలని ఇబ్బందులు పెడతారు' అని రాందేని శివ, పేరూర్ శివను అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవపడ్డాడు. దీంతో వెంకన్నపై కక్ష పెంచుకున్న రాందేని శివ ఎలాగైనా అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. అదేరోజు ఏకాదశి పండుగ కావడంతో బొలిగోర్ల వెంకన్న తన బావమరిది రావుల కోటయ్యతో కలిసి బైక్‌పై అడవిదేవులపల్లి మండలంలోని సత్రశాలకు దైవదర్శనానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో త్రిపురారం మండలం చెన్నాయిపాలెం గ్రామ శివారులోని అల్వాలపహాడ్ ఎక్స్‌రోడ్ వద్దకు రాగానే రాందేని శివ, పేరూర్ శివ కలిసి బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న బొలిగోర్ల వెంకన్న మెడ, ఛాతీ, వీపుపై పదునైన కత్తితో పొడిచి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు పారిపోయారు. గాయపడిన వెంకన్నను స్థానికులు ఆటోలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న త్రిపురారం పోలీసులు సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం నిందితులు రాందేని శివ, అతడి స్నేహితుడు పేరూర్ శివ గుంటూరు నుంచి తమ స్వగ్రామానికి వస్తుండగా ఎస్‌ఐ శోభన్‌బాబు తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని విచారించగా వెంకన్నను తామే హత్య చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. దీంతో వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో వేగంగా స్పందించిన త్రిపురారం ఎస్‌ఐ శోభన్‌బాబు, ఏఎస్‌ఐ రామయ్య, ఇతర పోలీసు సిబ్బందిని సీఐ గాంధీ నాయక్ అభినందించారు.

రౌడీ షీటర్‌గా గుర్తించడం లేదని..?

రాందేని శివ తండ్రి కరోనా సమయంలో మరణించాడు. తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. రాందేని శివపై గతంలో రౌడీ షీట్ ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది. తనను ఎవరూ గుర్తించడంలేదని, ఎలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలనే ఉద్దేశంతోనే వెంకన్నను రాందేని శివ హత్య చేసినట్లుగా తెలుస్తోంది.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా ఉండాలి. క్షణికావేశంలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మండలంలోని ప్రతి గ్రామంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా పెట్రోలింగ్ చేసేలా చూస్తాం.

– గాంధీ నాయక్, సీఐ, హాలియా

క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని మోసం

- యాప్ డౌన్‌లోడ్ పేరుతో రూ.1.34 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నకిరేకల్: క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని చెప్పి యాప్ డౌన్‌లోడ్ పేరుతో ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.34 లక్షలు కాజేశారు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన పోడిచెటి శ్రీనుకి గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ బ్యాంక్ ఖాతా నంబర్లకు క్రెడిట్ కార్డు ఎలిజిబులిటీ ఉందని చెప్పాడు. క్రెడిట్ కార్డు పొందాలంటే ముందుగా ఫోన్‌లో రస్క్ డెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమన్నాడు. ఆ తర్వాత మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నంబర్ చెప్పమని అడిగాడు. శ్రీను సదరు వ్యక్తి ఫోన్‌లో చెప్పింది నమ్మి సెల్‌కు వచ్చిన ఓటీపీ నంబర్‌ను అతడికి చెప్పాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి ఫోన్ పెట్టేయగా, కొద్దిసేపటికే శ్రీనుకు గల హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.1.34 లక్షలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో బిత్తరబోయాడు. వెంటనే బ్యాంక్ ఖాతాలు చెక్ చేసుకోగా డబ్బులు కట్ అయినట్లు గ్రహించి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌కు చేసి ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పొద్దని ఎస్‌ఐ సూచించారు.

సహజీవనం చేస్తున్న మహిళ హత్య

- పరారీలో నిందితుడు


ఉప్పలమ్మ మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): తనతో సహజీవనం చేస్తున్న మహిళను పదునైన ఆయుధంతో కొట్టి హత్య చేశాడో వ్యక్తి. ఈ ఘటన చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన ఉప్పలమ్మ(35)కు చివ్వెంల మండల పరిధిలోని కోమటికుంట గ్రామానికి చెందిన గట్టు ఉప్పలయ్యతో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు సంతానం. ఆరేళ్ల క్రితం ఉప్పలయ్య అనారోగ్యంతో మృతిచెందగా.. ఉప్పలమ్మ కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేసి ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. కొంతకాలం తర్వాత వీరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఆ తర్వాత చివ్వెంల మండల పరిధిలోని గాయంవారిగూడెం ఆవాసం టీకంతండాకు చెందిన ధరావతు రవితో ఉప్పలమ్మ సహజీవనం చేస్తోంది. రవికి అంతకుముందే పెళ్లై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి, ఉప్పలమ్మ అంతకుముందు కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీలో ఉంటుండగా, గత మూడు నెలల నుంచి సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి తిరిగి కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీకి వచ్చిన వీరిద్దరి మధ్య గొడవ జరగ్గా రవి పదునైన ఆయుధంతో ఉప్పలమ్మ తల, నుదుటిపై బలంగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో రవి కుడకుడలోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో ఉంటున్న ఉప్పలమ్మ తల్లి లక్ష్మికి జరిగిన విషయం చెప్పి ఘటనా స్థలానికి తీసుకురాగా ఆమె కుమార్తెను చూసి బిగ్గరగా రోదించింది. దీంతో ఇరుగుపొరుగు వచ్చేసరికి రవి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే వారు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఉప్పలమ్మను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్‌ఐ శివతేజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం వసురాంతండాకు చెందిన ధనావత్ దివ్యభారతి, ఆమె భర్త మాన్యానాయక్ కలిసి బతుకుదెరువు నిమిత్తం మిర్యాలగూడ పట్టణానికి వచ్చి స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నారు. కాగా జూన్ 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన దివ్య భారతి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఆమె భర్త మాన్యానాయక్ మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దివ్యభారతి ఆచూకీ తెలిసిన 8712577241, 8712670149 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

అతివేగంగా వెళ్తూ కారు బోల్తా

- వాహనంలో గంజాయి ప్యాకెట్లు లభ్యం


ప్రమాదానికి గురైన కారు

చిట్యాల: అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటన చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి నలుగురు వ్యక్తులు స్విఫ్ట్ కారులో హైదరాబాద్ వైపునకు అతివేగంగా వెళ్తుండగా.. వెలిమినేడు గ్రామ శివారులోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన చెట్లను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికులు వెళ్లి చేసేసరికి కారులోని ముగ్గురు పరారవ్వగా.. హైదరాబాద్‌కు చెందిన గుంటి సాయి వరుణ్ తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే పడిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి గురైన కారులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి చిట్యాల పోలీసులను సంప్రదించగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

బంధువులు అవమానించారని వ్యక్తి ఆత్మహత్య


ఘటనా స్థలంలో గోపాలకృష్ణ మృతదేహం

హుజూర్‌నగర్: బంధువులు అవమానించారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన తురక మట్టయ్యకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు తురక గోపాలకృష్ణ(32)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భవానితో 2019లో వివాహమైంది. వీరికి సంతానం లేదు. జూన్ 29న భవాని భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లింది. మరుసటి రోజు గోపాలకృష్ణ తన భార్యను తీసుకొని రావడానికి జగ్గయ్యపేట వెళ్లాడు. అక్కడ భవానీ మేనమామ దేశగాని వెంకటేష్, అతడి తల్లి అప్పమ్మ గోపాలకృష్ణను తిట్టి అవమానించారు. అనంతరం హుజూర్‌నగర్‌కు వచ్చిన గోపాలకృష్ణ మనస్తాపంతో గురువారం పట్టణ శివారులోని పోతిరేనికుంట కట్టపై గల వేప చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి మట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి



హుజూర్‌నగర్‌రూరల్: వ్యవసాయ భూమిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఐదు పాడి గేదెలు మృతిచెందిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ భూమిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి చిలుకూరు మండలం సీతారాంతండాకు చెందిన గుగులోతు బోజ్యానాయక్‌కు చెందిన 2 గేదెలు, గుగులోత్ రవీందర్‌నాయక్‌కు చెందిన 2 గేదెలు, గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన బాల్దూరి సత్యనారాయణకు చెందిన ఒక పాడి గేదె మృతిచెందాయి. మృతిచెందని గేదెల విలు రూ.2.50లక్షలు ఉంటాయని బాధిత రైతులు తెలిపారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి


మాట్లాడుతున్న వీరయ్య.చిత్రంలో జూలకంటి

నల్లగొండ టౌన్: ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక పేదలు ఉద్యమిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పేదల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 13లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం 3లక్షల ఇళ్లు కట్టి, 33వేల ఇళ్లను పంపిణీ చేసిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం గృహలక్ష్మి పథకం పేరుతో ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఎవరికీ ఇవ్వలేదన్నారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని, కార్మిక చట్టాలను మార్చి కార్మికుల హక్కులకు హరిస్తోందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీజేపీకి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, ఎండీ సలీం పాల్గొన్నారు.

రెండు రోజుల్లో 1,500కు పైగా..

- పరిష్కారం దిశగా ధరణి దరఖాస్తులు


అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్లు తదితరులు

నల్లగొండ: ధరణి సమస్యల పరిష్కారానికి నల్లగొండ కలెక్టరేట్‌లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం గురువారం రెండో రోజుకు చేరింది. ధరణి సమస్యలకు సంబంధించి జిల్లాలో మొత్తం 15వేల వరకు పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో ఈ రెండు రోజుల్లోనే దాదాపు 1,500లకుపైగా పెండింగ్ దరఖాస్తులను ఆయా మండలాల తహసీల్దార్లు, సిబ్బంది పరిష్కరించారు. శుక్రవారం కూడా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరగనుంది.

తాత్కాలిక ఉద్యోగుల జాబితా విడుదల

రామగిరి(నల్లగొండ): నల్లగొండ విద్యా శాఖలో సమగ్ర శిక్ష అభియాన్ కింద తాత్కాలిక పద్ధతిన ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకొని ఎంపికై న ఉద్యోగుల జాబితా విడుదల చేసినట్లు డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను deonalgonda.blogspot.com వెబ్‌సైట్ నందు పొందుపర్చినట్లు పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే శుక్రవారం (ఈనెల 7) లోగా డీఈఓ కార్యాలయంలో తెలపాలని కోరారు.

కార్మిక సంఘం సమావేశాలను జయప్రదం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు


మాట్లాడుతున్న వెంకటరాములు

నాగార్జునసాగర్: ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు నాగార్జునసాగర్‌లో ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు పిలుపునిచ్చారు. గురువారం సాగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మూడు రోజులపాటు జరిగే సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశాల సందర్భంగా మిర్యాలగూడెం నియోజకవర్గ కేంద్రంలో గ్రామీణ ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెమినార్‌లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయరాఘవన్, బి.వెంకట్, రాజ్యసభ సభ్యుడు శివదాసన్, మాజీ శాసన సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగయ్య, వెంకటరాములు పాల్గొంటారని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆహార భద్రత చట్టాన్ని నీరుగార్చిందని, సబ్సిడీ బియ్యం పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి ఆచరణలో విఫలమయ్యారన్నారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.పద్మ, రాష్ట్ర కార్యదర్శి కందుకూరి జగన్, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, రాష్ట్రకమిటీ సభ్యులు రవి, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనగల్ విద్యుత్ లైన్‌మెన్ సస్పెన్షన్

కనగల్: కనగల్ విద్యుత్ లైన్‌మెన్ నెలగొందరాశి ఎల్లయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన బిచ్చాల శ్రీను ఇటీవల విద్యుత్ అధికారుల నిర్లక్ష్య కారణంగా మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా విధుల పట్ల కనగల్ విద్యుత్ లైన్‌మెన్ అలసత్వం ప్రదర్శించడంతోనే శ్రీను మృతిచెందాడని బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ విషయంలోనే కనగల్ లైన్‌మెన్ నెలగొందరాశి ఎల్లయ్యను సస్పెండ్ చేస్తూ నల్లగొండ డీఈ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే విషయంపై ట్రాన్స్ కో ఏఈ రాజశేఖరాచారిని వివరణ కోరగా సస్పెండ్ అయిన విషయం వాస్తవమే తెలిపారు.

బుద్ధవనం అద్భుత శిల్పకళా నిలయం

నాగార్జునసాగర్: సాగర్ జలాశయతీరంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన బౌద్ధవారసత్వ థీమ్ పార్కు, బుద్ధవనం అద్భుత శిల్పకళా నిలయమని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఐఐడీసీ)మేనేజింగ్ డైరెక్టర్, వైస్‌చైర్మన్ నరసింహారెడ్డి అన్నారు. టీఎస్‌ఐఐడీసీ అధికారుల సమావేశాలకు నాగార్జునసాగర్‌కు వచ్చిన ఆయన గురువారం బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య బుద్ధవనంలోని వివిధ పర్యాటక ఆకర్షణలు, వాటి ప్రత్యేకతలను వారికి వివరించారు. నరసింహారెడ్డితో పాటు టీఎస్‌ఐఐడీసీ సీఈఓ మధుసూదన్ బుద్ధవనాన్ని సందర్శించారు. ప్రకృతి ప్రేమికుల కోసం కృష్ణాతీరం వద్ద గల వ్యూపాయింట్‌ను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. బుద్ధవనంలోని ప్రధాన ఆకర్షణ మహాస్థూపం చుట్టూ అలంకరించిన శిల్పఫలకాల్లోని బుద్ధుని జాతక కథలు, బౌద్ధ సాంస్కృతిక అంశాలను శివనాగిరెడ్డి వారికి వివరించారు. కార్యక్రమంలో బుద్ధవనం అధికారులు కె.సుధన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్ర సహకార బ్యాంకుల్లో విలీనం చేయాలి

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను రాష్ట్ర సహకార బ్యాంకుల్లో విలీనం చేయాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి ఈశ్వర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలోని డీసీసీబీలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, బ్యాంకులకు సరిపడా మూలధనాన్ని ప్రభుత్వం సమకూర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ బ్యాంకుల ఉద్యోగ సంఘాల నాయకులు రాజశేఖర్‌రెడ్డి, యాదయ్య, మల్లయ్య, సంధ్య, సహకార ఉద్యోగుల సంఘం నాయకులు షేక్ అలీమ్, సుగన్‌కుమార్, రాజు, మల్లిఖార్జున్, రవీందర్, అనిల్, రవిచందర్, రాగిణి, రఫీ, అంజయ్య, రజియోద్దీన్ పాల్గొన్నారు.

కుల రహిత సమాజానికి జగ్జీవన్‌రామ్ కృషి

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

నల్లగొండ: కుల రహిత సమాజానికి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ కృషి చేశారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దళితుల కోసమే కాకుండా అన్ని వర్గాల అభ్యున్నతి గురించి ఆలోచించిన మహనీయుడన్నారు. విప్లవాత్మక మార్పులు తీసుకురావడం వల్లే దేశంలో వ్యవసాయ రంగం పురోగతి సాధించిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం ఏర్పాటైందని, ఇది తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు.

నల్లగొండ రీజియన్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి


అవార్డు అందుకున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

నల్లగొండ రూరల్: ఆర్టీసీకి ఆదాయం సమకూర్చడంలో నల్లగొండ రీజియన్‌ను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని ఆర్ఎం శ్రీదేవి అన్నారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 4న ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న సిబ్బందిని గురువారం నల్లగొండలోని ఆర్ఎం కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రగతి చక్రాలు సిబ్బందేనని, సురక్షితమైన ప్రయాణం, ఆదాయం సమకూర్చడంలో వీరి పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. మిగిలిన ఉద్యోగులు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం శివకుమార్, కేశవులు, మోహన్ పాల్గొన్నారు.